


"వాడి పేరేమో ఈ రిజర్వ్‌డ్‌లిస్టులో ఉంది కాని వాడు మాత్రం కనిపించటంలేదురా!" బెజవాడ స్టేషన్లో దామోదరరావు రామలింగంతో అన్నాడు, కొంచెం ఆశ్చర్యపోతూ.

"ఆ అబ్బాయి మీ ఫ్రెండా? రాత్రి ఒకసారి లేచి వెళ్ళాడు. మళ్ళీ కనిపించలేదు. ఇక్కడే ఎక్కడేనా ఉన్నాడనుకున్నాను. అదిగో అతని సామానుకూడా అక్కడే ఉందే!" అన్నాడు సామాను దింపించి కూలిని కుదుర్చుకుంటున్న ఒక నడివయస్సు మనిషి.

"అలాగండి! వారే దామోదరం రిపోర్టిద్దాం రారా!—" రామలింగం, దామోదరం తనతో మాట్లాడిన వ్యక్తితో స్టేషన్ మాష్టరు ఆఫీసు వయిపు నడిచివెళ్లారు. "అతను మా ఫ్రెండండి. మెడ్రాసులో చదువుకుంటున్నాడు, ఇంజనీరింగ్ కాలేజిలో. సెలవులకి ఇంటికెడుతూ ఇక్కడ రెండ్రోజులుండి పోదామనుకున్నాడు. ఏమిటో..."

* * *

పెద్ద బ్రేకుల చప్పుడుతో రయిలు బండి నెమ్మదిగా ఆగింది. తలుపు దగ్గరే నుంచుని ఉన్న సూరి కిందకి దిగాడు. అప్పటికి మధ్యరాత్రి దాటింది. బాగా వెన్నెల కాస్తోంది. ముందు పెట్టెల కొన్నిటి దీపాలు పసుపుపచ్చగా వెలుగుతున్నాయి. దూరంగా ఇంజన్ కూత వినిపిస్తోంది. వెన్నెలలో ఆవిరి, పొగ స్పష్టంగా కనిపిస్తున్నాయి. బండి ఆగటంతో కొందరు ప్రయాణీకులు దిగుతున్నారు. అసలు ఎందుకు ఆగిందో సూరికి అర్థంకాలేదు. అది పెద్ద బయలు ప్రదేశం. ముందు స్టేషన్‌కాని సిగ్నల్ కాని కనిపించటంలేదు. ఎవరో పొరపాటున గొలుసు లాగి ఉంటారని ఊహించాడు. మాకు అందినది ఆఖరిపెట్టె. రయిలుబండి చిట్టచివర నుంచుంటే ఎలా ఉంటుందో, అనిపించింది సూరికి హటాత్తుగా. పెట్టె వెనుక వయపుకి నడిచి వెళ్లాడు. అనాలోచితంగా మరికొంత దూరం పట్టాల వెంబడే నడిచి వెళ్లాడు. వెనక్కి తిరిగి చూశాడు. దూరంగా ఏవో మాటలు, ఇంజన్ బుసలు సన్నగా వినిపిస్తున్నాయి. బండి గభాలున బయలుదేరి వెళ్లిపోతే తను ఈ చోట వంటరిగా ఉండిపోతాడు. ఈ ఊహకి సూరి నవ్వుకున్నాడు. చుట్టూ కలయచూశాడు. అది చాలా చదును ప్రదేశంగా కనిపించింది. నేల వెన్నెలలో తెల్లగా మెరుస్తోంది.

అక్కడక్కడ చెట్లు నల్లటి పొదలలాగా కనిపిస్తున్నాయి. పరధ్యాన్నంగా మళ్లీ ముందికి సాగిపోయాడు సూరి. మూడు నాలుగు అడుగులు వేశాడోలేదో కాలు బద్దీలో ఇరుక్కుని బోర్లాపడ్డాడు. ఏదో నుదుటికి గట్టిగా తగిలింది...

* * *

సూరికి స్పృహ వచ్చేసరికి ఒక క్షణం తమ రయిలు పెట్టెలో ఉండటానికి బదులు కంకర్రాళ్ల మీద చెంప ఆనించి ఎందుకు పడుకున్నాడో అర్థం రాలేదు. కాని వెంటనే జరిగినదంతా జ్ఞాపకం వచ్చింది. గాభరాగా లేచి చూశాడు. రయిలు బండి కనిపించలేదు. కంగారుగా కొన్ని గజాల ముందుకి పరిగెత్తాడు. తర్వాత కోలుకుని చేతిగడియారం చూసుకున్నాడు. వొంటిగంట కావస్తోంది. అంటే తను ఇక్కడ అరగంట, ముప్పావు గంటకి పయిన స్పృహ తప్పి పడి ఉన్నాడన్నమాట! నుదురు తడిమి చూసుకున్నాడు. పెద్ద బొప్పి కట్టింది. మొదట కొద్ది క్షణాలలో తను గమనించలేదు. కాని తల భారంగా పోటుగా ఉంది. పెద్దగాయం తగలలేదు కాని తనిప్పుడు ఏమి చెయ్యాలి?

"ఉత్తనే కంగారుపడి లాభం లేదోయ్!" అని తనతో తనే చెప్పుకున్నాడు. రుమాలు బయటికి తీసి మొహం అంతా శుభ్రంగా తుడుచుకున్నాడు.

—చుట్టుపక్క లేమయినా ఊరు ఉంటే ముందు అక్కడికి పోవటం మంచిది!— నలుదిక్కులా చూశాడు. ఒకవయిపు సన్నగా, నీలంగా ఏదో కాంతి కనిపిస్తోంది. గ్రామంలో గాస్ లయిటు వెలిగించి ఉంటారు, అనుకుని అటు బయలుదేరాడు. వెన్నెలలో దారి సులభంగా కనిపిస్తోంది. జోరుగా వీస్తున్న గాలి తల భారం మరపింపచేసేట్లుంది.

దగ్గిరికి వెళ్లేకొద్దీ వెలుగు అధికం అవుతోంది. వెలుగుతోబాటే ఏదో ఒక శబ్దం కూడా వినిపిస్తోంది. పెద్ద మోటారు పని చేస్తూంటే వచ్చే మోతలాగా ఉంది. అంతా దట్టంగా ఎదిగిన చెట్ల సమూహం వెనక నుంచి వస్తున్నట్లుంది.

—ఊరేమీ కనిపించడం లేదేమిటి!— అనుకుంటూ సూరి నడకవేగం హెచ్చించాడు. నాలుగయిదు నిముషాల్లో చెట్ల గుంపుని ప్రవేశించాడు. అక్కడ కనిపించిన దృశ్యం చూసి అదిరిపడ్డాడు.

* * *

చెట్లగుంపు అవతల చిన్న బయలు ప్రదేశం వొకటి ఉంది. దాని మధ్య సుమారు డెబ్బయి, ఎనభయి అడుగుల వెడల్పు ఉన్న పెద్ద పళ్లెం లాంటి వస్తువు ఒకటి ఉంది. ఏదో వెండిని పోలిన లోహంతో చేసి ఉందేమో వెన్నెలకాంతిలో, వాని మధ్యనే ఉన్న గాజు గోపురంలాంటి నిర్మాణంలో నుంచి వస్తున్న నీలం వెలుగులో విచిత్రంగా మెరుస్తోంది. దాని అంతర్గర్భంలో నుంచి వస్తున్నట్లుంది. ఎన్నో తుమ్మెదల ఝుంకారం పోలిన శబ్దం. ఆ శబ్దానికి నేలకూడ అదురుతున్నట్లు ఉంది. సూరి తలంతా దిమ్మెక్కిపోయినట్లుంది.

. కె.యల్. నారాయణ



వైద్యవిద్వాన్, వైద్యాచార్య
చర్మవ్యాధులకు, స్త్రీల వ్యాధులకు, పక్షవాతం, సుఖ వ్యాధులకు, సెక్సు, నరముల బలహీనతలకు, ఆయుర్వేద చికిత్స.
పోస్టుద్వారా చికిత్స కలదు.

**లక్ష్మి కుమారి క్లినిక్,**

మెయిన్ రోడ్, తెనాలి.

*డా॥ వి. వి. కె. రావ్, B.A.*

వైద్య విద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్
వివాహము వాయిదా వేయనవసరం లేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్రస్కలనములకు ఆయుర్వేద చికిత్స.
పోస్టుద్వారా చికిత్స కలదు.



**రావూస్ క్లినిక్**

టి. బి. రోడ్, తెనాలి.

ఫోన్ : 3700 & 4010.

## కార్టూన్లు పంపేవారికి మనవి

**కార్టూన్లతోపాటు స్వంత చిరునామాగల స్టాంపులు అతికించిన కవరు పెట్టి సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వార పత్రిక, గాంధీనగరం, విజయవాడ—3. అన్న చిరునామాకి టపాలో పంపాలి. వీటి పరిశీలనకు కనీసం 6 నుంచి 8 వారాలు పట్ట వచ్చును. ఈలోగా, నేరుగా కాని, టపాలో గాని వీటిపై ఉత్తర ప్రత్యుత్తరాలకు తావు ఉండదు. కార్టూన్లు 'టపా'లో పోయినా, దారి తప్పిపోయినా సంపాదకుని బాధ్యత వుండదు. ప్రత్యేక సంచికలకు కార్టూన్లు పంపేవారు కవరుమీద ఆ సంచిక పేరు ఉదహరించాలి. ఈ కార్టూన్లకి కూడా పై నిబంధనలు వర్తిస్తాయి.**

—సం.

# దూర ప్రయాణం

అనుమతి లేనిదే ఏ గోళంమీది జీవులతో సాన్నిహిత్యంకాని వీలులేదని మా ప్రభుత్వంవారు శాసించారు. ఇప్పుడు అనుకోకుండా నువ్వు మాకు తగిలావు. మేము వెళ్లే గ్రహంలో మా అధికారులకి జరిగినదంతా చెప్పి వారి ఆజ్ఞానుసారం నడుచుకొనవలసి వస్తుంది...'' అన్నాడు 'డక్క ఎ' నుంచి వచ్చిన వ్యక్తి.

సూరికి ఏమనాలో తెలీదు. ఒకటి రెండు క్షణాలు ఆలోచించి అమాంతంగా లేచి బయటికి పారిపోతే ? కాని తలుపువేసి ఉంది !

''నువ్వు సరిగ్గా నడుచుకొనకపోయినట్లయితే నిన్ను నిర్బంధించవలసివస్తుంది. అనవసరంగా ఆ పరిస్థితి రానివ్వకు !'' యంత్రంలాగ చెప్పాడు ఆ వ్యక్తి.

*　　*　　*

''వీడే అడవిలోనో దిగితే ఏ పులో, సింహమో పట్టుకుపోయిందేమో ?'' అన్నాడు దామోదరరావు రామలింగంతో.

''నీ మొహం, ఇక్కడ పులులూ సింహాలూ ఎక్కడరా ! ఇదేదో పెద్ద విచిత్రంగానే ఉంది. పేపర్లో ఎడ్వర్టయిజ్మెంట్ వేశాము కదా! ఎవరో ఏదో చెప్పకుండా ఉంటారంటావా ?''

*　　*　　*

ఆ విమానంలో పదిమంది ఉన్నారు. ఇంకా అయిదు మందికి సరిపోయే ఖాళీ, సౌకర్యాలు ఉన్నాయి. సూరి కూడా తక్కిన ప్రయాణికులలలాగే తన సీటు బెల్టు వేసుకుని కూర్చున్నాడు. విమానం లోపలి యంత్రాల మోత విపరీతంగా పెరిగింది. దాని కదలికలకి వళ్లంతా అదిరిపోతున్నట్లనిపించింది అతనికి. కొన్ని నిముషాల తర్వాత విమానం పయికి లేచినట్లనిపించింది. అతి వేగంగా లేవటంవల్ల కొంత సేపు చాలా బాధపడ్డాడు. ఒక అరగంట గడిచింది. తర్వాత అక్కడికి తనతో మాట్లాడిన వ్యక్తి వచ్చాడు. అతనిపేరు 'హమా' అని సూరికి తెలిసింది. ఆ విమానం ముఖ్యాధికారి పేరు 'నెబు'ట. తక్కినవారి కొందరి పేర్లు హమా చెప్పాడు కాని కొత్తగా ఉండటం చేత అవి సూరికి తల కెక్కనే లేదు.

''విమానం పూర్తిగా బాగుపడలేదు. మామూలు వేగంలో వెళ్లలేకపోతున్నాము.అయినా ఇటొచ్చి చూడు, మీ భూగోళం ఎంత స్పష్టంగా కనిపిస్తోందో !'' అన్నాడు ఒక టెలివిషన్‌వంటి యంత్రం చూపిస్తూ.

''పెద్ద చంద్రగోళంలాగ ఉంది !'' ఎన్ని బొమ్మలు, ఫోటోలు పత్రికలలో పడినవి చూసినా వింత కాంతితో వెలుగుతూ కనిపించిన భూగోళాన్ని చూసేసరికి సూరి గొంతుకలో ఏదో ఇరుక్కున్నట్లయింది.

''అదిగో మీ దేశం !'' లేత నీలం, అకుపచ్చ, ఉదారంగులతో ముదురు నీలం కలిసి ఉన్న ఖండాల సముద్రాల రేఖలలో భారతదేశం ఆకారం బడిలో చూపించే గోళాల నమూనాలలో కనిపించే ఆకారంలాగే ఉంది !

''మా ప్రపంచంలో వారూ త్వరలో చంద్ర మండలానికి వెళ్లబోతున్నారు తెలుసా?'' అన్నాడు సూరి కొన్ని క్షణాల మవునం తర్వాత.

''విన్నాను ! మా గ్రహం చుట్టూ నాలుగు ఉపగ్రహాలు పెద్దవి తిరుగుతూ ఉంటాయి. కొన్నివేల సంవత్సరాల క్రితమే వాటిలో మేము స్థావరాలు ఏర్పరుచుకున్నాము. మా అంతరిక్ష యానం చాలా పురోగమించింది—మీరు సాధించిన దానితో పోలిస్తే, ఈ విమానం గంటకి కొన్ని వేల కిలోమీటర్ల వేగంతో ఆకాశంలో వెళ్లగలదు. లేదా ప్రత్యేకమయిన ఏర్పాట్లతో కాలంలో కూడా ప్రయాణం చెయ్యగలదు. ఈ రకం గమనం గురించి మీ శాస్త్రజ్ఞులు కనిపెట్టే ఉంటారు.''

''అవును, అయిన్‌స్టెయిన్ అనే ఆయన దీనిని గురించి కొన్ని సిద్ధాంతాలని ప్రతిపాదించాడని చదివాను. నా చిన్నప్పుడు హెచ్.జి. వెల్స్ అనే బ్రిటిష్ రచయిత 'టయిమ్ మెషీన్' అనే పుస్తకం చదివాను. అందులో కాలంలో గమనం గురించి ఎంతో బాగా రాశాడు ! మనం కూడా ఆ రకం ప్రయాణం చేస్తామా ?'' అని కుతూహలంతో అడిగాడుసూరి. ఇదంతా ఒక కలయేమో అనే అనుమానం చూచాయగా కలుగుతున్నా దానిని అణగదొక్కి వేశాడు. తన మామూలు ప్రపంచం ఇప్పుడు ఎంతో దూరంగా అనిపిస్తోంది. 'డక్క ఎ' గ్రహవాసులు వింతగా కనిపించటం లేదు. ఆకారంలో చిన్న భేదాలు, మాట తప్ప ఇంచుమించు మనుష్యులలాగే ఉన్నారు. హమా వద్ద ఎన్నో కొత్త విషయాలు అడిగి తెలుసు కోవాలని ఆరాటంగా ఉంది సూరికి.

''విమానం పూర్తిగా బాగుపడలేదని చెప్పాను కదూ ? లేకపోతే ఆకాశంలో బదులు కాలంలోకి మారి పోయేవారమే ... వివా సూర్యమండలంలో ఒక ఎర్రటి గోళం ఉంది. అక్కడ దిగి అవసరమయిన మరమ్మత్తులు చేసుకోవటానికి నిశ్చయించుకున్నాము. మా లోకానికి రేడియో సంకేతం ఒకటి పంపాము. జవాబు రావటానికి ఒకటి రెండు రోజులు పట్టవచ్చు. మామూలు రేడియో ప్రసారాలు దానికి చాలవు. వేగం మరీ తక్కువ ! ప్రత్యేకమైనకిరణప్రసారం వాడుకుంటాము...''

''మరి వేగం తగ్గి ప్రయాణ కాలం అధికం అయినప్పుడు ఆహారం, గాలి వంటి సౌకర్యాలకి ఇబ్బంది కాదా?'' సూరికి హటాత్తుగా అనుమానం కలిగింది.

''వస్తుంది ! నిజం చెప్పాలంటే ఇప్పటికే మన పరిస్థితి ఏమీ బాగాలేదు. కాని నేను చెప్పిన గ్రహం—దానిని ఇంగ్లీషులో మార్స్ అంటారనుకుంటాను—చేరేదాకా ఎలాగో అలా సద్దుకోవచ్చు. మీలాగే మేమూ ప్రాణవాయువు పీలుస్తాము.

మా దేహ స్వభావం కూడా ఇంచుమించు అటు వంటిదే కాని కృత్రిమ ఆహారాలకి అలవాటు పడగలిగాము. త్వరలో నీకూ రుచి చూపిస్తాము.''

సూరి ఏదో అనపోతూ ఉండగా వారి విమానం అమాంతం ఒక కుదుపు ఇచ్చింది. దాని వేగానికి తట్టుకోలేక సూరి పడ్డాడు. ఇంతలో వారున్నగదిలో లవుడ్ స్పీకర్‌లో నుంచి ఈలలు కొన్ని, ఏవేవో మాటలు వినిపించాయి. గోడమీద చెయ్యిపెట్టి పడిపోకుండా నుంచున్న హమా మాత్రం దానిని వింటూ కంగారు పడ్డట్టు కనిపించాడు.

''సూరి! త్వరగా లేచి నీ సీట్లో కూర్చో పరిస్థితి ప్రమాదంగా ఉందిట! X—! X X X - !!!?'' తత్తరపాటులో హమా తన భాషలోకి మారిపోయాడు.

* * *

''వెన్నెల చూడరా ఎంత బావుందో! పాపం, సూరి ఒకసారి వెన్నెల గురించి కవిత్వం రాస్తే వాడ్నెంత ఏడిపించామూ! వాళ్లమ్మా, నాన్నతో చెప్పి ఇంజనీరింగ్ మాన్పించి లిటరేచ రులో చేర్పిస్తామని అన్నాము గుర్తుందా?'' వంతెన మీద నుంచుని పాదరసంలాగ పారి పోతున్న నదిలోకి చూస్తూ అన్నాడు.

''వాడికసలు అంతరిక్ష యానమంటేనే పిచ్చి! ఎప్పటికయినా స్పేస్ ట్రావెల్ అంతర్జా తీయం అయితే అందులోకెలాగయినా వెళ్లటానికి ప్రయత్నిస్తానని అంటూ ఉండేవాడు ... వాళ్ల తాతయ్య మాత్రం మనిషి చస్తేచంద్రలోకం చేరు కోలేడనే వాదిస్తాడు మారినర్లు, ఆర్బిటర్లు, వోస్కోడ్లు అంతా మోసం అంటాడు... !''

* * *

''అయితే ఇప్పుడేమి చేద్దాము?'' అనడి గాడు సూరి మళ్లీ. ఈ ప్రశ్న ఎన్నిసార్లు వేశాడో లెక్కలేదు. హమా సమాధానం ఇవ్వలేదు. ఇద్దరూ చిన్న టాంకువంటి వాహనంలో చంద్ర గోళం మీద ఒక లోయలో కూర్చుని ఉన్నారు. అప్పటికి చీకటిపడింది. కాని, ఆకాశంలో ఉజ్వలంగా వెలిగే భూమి 'వెన్నెల'లో ఇరువైపులా ఉండే రాతికొండలు భయంకరంగా, అందంగా కనిపిస్తున్నాయి.

వారి విమానం చెడిపోవటంతో దాని అధికారి చోదకుడు, ఇంజనీరు — వీరిద్దరితో నూ అత్యవసరంగా సంప్రదించి దిగటానికి సౌకర్యంగా ఉన్న చంద్రగోళంమీద దింపటానికి నిశ్చయించు కున్నాడు. కొంచెం కష్టంమీద విమానాన్ని చంద్రగోళంమీద దింపారు. మరమ్మత్తు సాగుతూ ఉండగా నెబు హమాకి, సూరికి ఒకసారి బయటికి వెళ్లిరావటానికి అనుమతి ఇచ్చాడు. బయట తిరిగి రావటం కోసం చిన్న టాంకు వంటి బండి ఒకటి ఉంది. అది నిజానికి జెట్‌ల వల్ల నడిచే బండి. అవసరానికి టాంకులకి ఉండేటటు వంటి చక్రాలు, పట్టీలు కూడా ఉన్నాయి. భూమిమీద కాలానికి సుమారు రెండు గంటలకి సరిపోయే వ్యవధి ఇచ్చి తిరిగి వచ్చెయ్య మన్నాడు కెప్టెన్ నెబు. చిన్నబండికీ విమానానికి మధ్య రేడియో సౌకర్యం ఉంది.

సూరి, హమా జాగ్రత్తగా విమానం దిగిన ప్రదేశం చుట్టూ తిరగటం ప్రారంభించారు. ఎటుచూసినా చెట్టు చేమలేని రాతికొండలు, స్తంభించిపోయిన అగ్ని పర్వతాలు, ఊహకి అందనంత. పూర్వకాలంలో చిత్రవిచిత్రంగా గడ్డకట్టుకుపోయిన శిల. కలలో కూడా ఇంత వింత ప్రకృతి స్వరూపం చూడలేదనుకున్నాడు సూరి.

''ఇంతకన్నా విచిత్రమయిన గోళాలు చూశాను. బురద సముద్రాలూ, జంతువులని తినే చెట్లూ మన అంత ఉన్న పతులూ — ఒకటేమిటి!'' అన్నాడు హమా సూరి తన ఆశ్చర్యాన్ని ప్రకటించగా. ''ఒక గంట అయింది. ఇంకొక గంట ఉంది. మరమ్మత్తు ఎంతదాకా వచ్చిందో నెబుని అడుగుతాను!''

హమా తన భాషలో ఏదో అన్నాడు రేడియో మయిక్రోఫోన్‌లోకి. కొంత సంభాషణ జరిగింది. ఇంతలో అతని సాధారణ ధోరణి మారిపోయి ఒక చిన్న కేక వేశాడు. అతనితో కొంత పరిచయం కలిగిన సూరికి అతని ముఖంలో ఆశ్చర్యం, భయం, ఆందోళన కనిపించాయి.

''ఏమయింది?'' అని అడిగాడు.

''అదే అర్థం కావడంలేదు! నెబూతో మాట్లాడుతూనే ఉన్నాను. ఒక పెద్ద శబ్దం అయింది. ఆ తర్వాత పూర్తి నిశ్శబ్దం! ఎందుకయినా మంచిది. వెనక్కి తిరిగి వెళ్ల పోదాం...''

బండిని వెనక్కి తిప్పారు. ఒక చిన్న లోయలో మలుపు తిరగగానే వారి కంటికొక భయంకర దృశ్యం కనిపించింది. వారి విమానం తునాతునకలయి పొగలు కక్కుతూ ఉంది. ఆ భీభత్సం మధ్యవారికి చాలా పెద్ద బండవంటిది ఒకటి కనిపించింది.

''పెద్ద ఉల్క ఒకటి రాలి ఉంటుంది. ఎంత ప్రమాదం జరిగింది! కోటికొక ఉల్క కూడా ఇలా ఇంతమందిని నేలమీద చంపి ఉండదు'' అంటూ మొదలుపెట్టిన హమా క్రమంగా తన భాషలోకి మారిపోయాడు. సూరికికూడా ఎవరో ఆప్తులు పోయినట్లనిపిం చింది. జాగ్రత్తగా విమానాన్ని సమీపించారు. ఆ భీభత్సంలో వారికి ఏదీ మిగిలినట్లు కనిపించ లేదు. ఇక తక్కినవారికోసం వెతికి లాభంలేదని నచ్చచెప్పాడతనికి సూరి.


ఎంతసేపు అలా ఉండిపోయారో సూరికి తెలియలేదు కాని అప్పుడప్పుడు— ''ఇప్పుడు ఏం చేద్దాము?'' అని అడిగేవాడు. తన దుఃఖంలో మునిగిఉన్న హమా అతన్నిముందు అంతగా పట్టించుకోలేదు. కాని చివరికి, ''వీలయినంత కాలం ఇలా ఇక్కడ ఉండిపోదాము! లేదా బయటికి పోయి ప్రాణాలు వదులుకుందాము...'' అన్నాడు.

''అదేం మాట? అంత తేలిగ్గా ఆశవదులు కుంటే ఎలాగ? ఇంత నిర్మానుష ప్రదేశంలోనూ ఎక్కడో మన బండిని దాచుకునే చోటు ఉండక పోదు. ఇక్కడే ఇలా ఉంటే మనమీద ఒక రాయి పడవచ్చు కదా?''

* * *

''చూశావా మనవాడు 'ఇన్టర్ ప్లానెటరీ ఎసోసియేషన్'లో చేరాట్ట! మనకి చెప్పనే లేదు!!'' హాస్టల్లో సూరి రూమ్‌మేట్ శ్యామలరావు కార్డు ఒకటి చదివి దాన్ని రామలింగానికి అందచేస్తూ అన్నాడు.

'చంద్రుని కెక్కలేనమ్మ గ్రహానికేమెక్కు తుంది? ముందు 'మూన్ ట్రావెలర్స్ ఎసోసి



యేషన్' పెడితే సరిగ్గా ఉండేది !'' అన్నాడు నాగరాజు.

''త్వరలోనే ఎప్పోల్లో ప్రాజెక్టుని అమెరికన్లు ప్రయోగిస్తారుట— అంతలోనే రష్యన్లు కాస్తా ఆ పని చేస్తారేమో !'' శ్యామలరావు అన్నాడు.

''అప్పటికయినా మనవాడు దొరుకుతాడంటవా ? సూరీ వాళ్లమ్మ పాపం చాలా బెంగ పెట్టుకుంటోందిట ...''

* * *

''ఆ గుహలోకి వెడదామా?'' అని అడిగాడు సూరి. కొన్ని గంటలు తిరిగిన తర్వాత ఒక పెద్ద కొండలో గుహ ఒకటి కనిపించింది.

''ప్రాచీన మానవుడు గుహవాసి కద ! మన స్వభావం ఎక్కడికి పోతుంది ?'' హమా పరిహాసంగా మాట్లాడుతున్నాడని సూరికి తెలుసు.

జాగ్రత్తగా వాహనాన్ని గుహ వద్దకి తీసుకుపోయాడు హమా. చాలా లోతుగా ఉన్నట్లుంది, అవతల వయిపు గోడ కనిపించటం లేదు. హమా లైట్లు వేశాడు.

''ఇదేమిటి ? కలకంటున్నానా ? నేను చూసేదీ నీకూ కనిపిస్తోందా !'' సూరి కళ్లు నులుముకుంటూ అన్నాడు.

''కలకాదు నిజమే...''

గుహ సుమారు వంద అడుగుల లోపల బాగా వెడల్పయి లోపల మహామందిరం వంటి ప్రదేశం ఉంది. ఈ మందిరం పొడుగు కొన్ని వందల గజాలు, వెడల్పు కనీసం వంద గజాలు ఉంది. దీనంతటికీ మధ్య బోర్లించి ఉన్న బార్లీ మూకుడు వంటి పెద్ద 'గాజు' నిర్మాణం వుంది. దాని పరిణామాలు ఎత్తు సుమారు ఏభయి అడుగులు. వెడల్పు సుమారు మూడు, నాలుగు వందల అడుగులు ఉంది. స్పష్టమయిన గాజు లోపల ఏవో నిర్మాణాలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి. అనుమానంగానే తమ బండిని గాజు మూకుడు దగ్గరికి తీసుకుపోయాడు హమా.

# దూర ప్రయాణం

''లోపలికి వెళ్లేందుకు తలుపదిగో ! లోపలివన్నీ ఏదో పవర్ హవుస్‌లాగ కనిపిస్తున్నాయే !!''

''ఇంత దూరం వచ్చిన తర్వాత ఇక సందేహించి లాభంలేదు. ఈ సూట్లు వేసుకుని బయటికి దిగి దానిలోపలికి వెళ్లటానికి ప్రయత్నిద్దాము రా !'' అన్నాడు హమా, సూరి ఉత్సాహంగా అన్న మాటలకి సమాధానంగా.

పది నిముషాల లోపల ఇద్దరూ అంతరిక్ష వస్త్రాలు ధరించి గాజు నిర్మాణం తలుపుముందు నుంచున్నారు. సూరి సంకోచం లేకుండా చెయ్యి జాపి తలుపు పిడిని పట్టుకు లాగాడు. సునాయాసంగానే తలుపు తెరవగలిగాడు. ఇద్దరూ లోపలికి అడుగు వేశారు. అది చిన్న గదిలాగ ఉంది. ముందు మరొక తలుపు కనిపించింది.

''ఇది వాయుబంధం వంటిది. వెనకతలుపు మూసుకోనీ !'' అన్నాడు హమా రేడియోద్వారా. సూరి వెనక్కి తిరిగి చూశాడు. తలుపు మూసుకుంది. వెంటనే ఆ గది ఒక నీలం వెలుగుతో నిండిపోయింది. కొన్ని క్షణాలు గడిచాయి.

''ఇక్కడ గాలి వుంది ! ప్రాణ వాయువు ఉన్నట్లే చూపిస్తోంది ఈ మీటర్ !'' హమా తమ అంతరిక్షవస్త్ర సామగ్రితోబాటే వచ్చే మీటర్ ఒకదానిని ముందు పట్టుకుని పరిశీలిస్తూ అన్నాడు. 'పీడనం కూడా సరిగ్గానే ఉంది !!'

సూరి తన తల కప్పు తీసివేశాడు. గాలిలో ఏదో రసాయనం వాసన ఉన్నప్పటికీ పీల్చటానికి సరిగ్గానే ఉన్నట్లుంది.

పదిహేను నిముషాల తర్వాత ఇద్దరూ లోపల ఒక చిత్రపటం ముందు నుంచున్నారు. అది వారు నుంచున్న గాజు నిర్మాణానికి సంబంధించినదేనని స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

'ఈ భాష నాకు తెలుసు !' అన్నాడు సంతోషంగా హమా పటంలోని అక్షరాలని కొన్నిటిని చూసి. 'ఇది ఒకప్పుడు అంతరిక్ష యానంలో మా ప్రాంతంలో వివిధ గ్రహాలవాళ్లు వాడేవాళ్లు. తర్వాత ఇది ఒక గ్రహం వారిదని, అందరిమీదా రుద్దటం అన్యాయమనీ కొందరు పోట్లాడారు ! ఇది మా భాష కాదు కాని నాలాగ అంతరిక్షయానం తరచుచేసే వారందరికీ ఏదో కొంత రాకుండా ఉండదు...'

* * *

'ఇలా చంద్రమండలం మీద— పోనీ కొండ గర్భంలోపల ! — కొన్ని వేలకి వేల ఏళ్లముందు ఎవరో ఒక లోకంవారు ఎందుకో కట్టుకున్న ఈ భవనంలో మనం ఇలా అన్ని సౌకర్యాలూ అనుభవిస్తున్నామంటే నాకే నమ్మేట్లు లేదు !' అన్నాడు సూరి. ఇద్దరూ లోపల ఒక గదిలో కూర్చుని ఒక వింత పానీయాన్ని తాగుతూ, వింత ఆహారాన్ని తింటూ కూర్చున్నారు. ఆ భవనంలో వాతావరణం, ఆహారం, పానీయాలూ అన్నీ కృత్రిమంగా తయారయ్యేవే. హమా చెప్పిన దాని ప్రకారం అప్పటికి సుమారు ఏభయి వేల సంవత్సరాల క్రితం చంద్రమండలంలో ఒక గ్రహంవారు రహస్యంగా కట్టుకున్న స్థావరం అది. అక్కడ అణ్వస్త్రాలు కొన్ని దాచి ఉంచాలని వారి ఉద్దేశం. చివరికి వారి పథకం నెగ్గలేదు. కాని స్థావరం రహస్యంగా అలాగే ఉండిపోయింది. అందులో ఉన్న కొందరూ క్రమేణా నశించి ఉంటారని హమా ఊహ. కాని, అసలు స్థావరం నిర్మాణం చాలా కట్టుదిట్టంగా ఉండటంవల్ల, లోపల స్థాపించిన యంత్రాలు చెక్కు చెదరకుండా పని చెయ్యటం వల్ల ఆ కృత్రిమ నగరం అలాగే ఉండిపోయింది. దాని నిర్వాహకులు సాంకేతికంగా ఊహించరానంతగా అభివృద్ధి చెందినవారయి ఉంటారని సూరి గ్రహించాడు.

''అవును, కాని ఇలా ఈ గుహలో ఎంత కాలమని ఉండగలం ?'' హమా ప్రశ్నవేశాడు.

''గత్యంతరం లేదు కదా ! లోపల వెతుకుదాము. రేడియో ప్రసారం వంటి దేదయినా వీలయితే సందేశాలు పంపిద్దాము. లే, హమా ! పని మొదలుపెడుదాము రా ... ''

* * *

''ఒరే, దామోదరం ! ఈ వార్త చూశావా? చంద్రమండలయానం అనుకున్న దానికంటే తొందరగా అవుతుందిట ! ఆరునెలల్లో మొదటి రాకెట్ బయల్దేరుతుందిట !!'' శ్యామలరావు ఒకరోజు అన్నాడు.

''అరె ! అలాగా ? మన సూరే కనక ఇక్కడిప్పుడుంటే ఎంత సంతోషించేవాడో కదా ! వాళ్ల తాతయ్యతో కాసిన పదిరూపాయల పందెం గెలుచుకునే కాలం దగ్గిర కొచ్చిందన్నమాట...''

* * *

విజయనగరం లియోక్లబ్‌వారు ఇటీవల 'చార్టర్' దినోత్సవం జరుపుకున్న సందర్భంగా లియోక్లబ్‌ల జిల్లా చైర్మన్ లయన్ డా. గోలి శ్రీరాములు 'చార్టర్' బహుమతిని అందజేస్తున్న దృశ్యం. శ్రీమతులు వి.వి. కల్యాణి (కార్యదర్శి), బి. జయశ్రీ (అధ్యక్షురాలు), సమతా జైన్ (కోశాధికారిణి)గార్లని కూడా చిత్రంలో చూడవచ్చు.



# హైదరాబాద్ నోట్‌బుక్

## ఉపాధ్యాయులకు నోటీసు :

నవంబర్ 15న నిజాం కళాశాలకు వెళ్లాను ఒక ఉపాధ్యాయులను కలుసుకోడానికి. అది మధ్యాహ్న భోజన సమయం. తమ ఉమ్మడి హాలులో ఉపాధ్యాయులంతా ఉన్నారు. భోజన సమయం గడిచింది. తరగతుల ప్రారంభం సూచించే గంట గంటకొట్టింది. కొందరు ఉపాధ్యాయులు కదల్లేదు. ఏమిటి మీకు తరగతులు లేవా ? అనడిగాను. ఉన్నాయి. విద్యార్థుల కోసం ప్రతీక్షిస్తున్నాము — అన్నారు. మీరు ప్రతీక్షించడమేమిటి ? విద్యార్థులు మీకోసం ప్రతీక్షించాలి కదా ! — అన్నాను. ఇక్కడి సంప్రదాయం వేరు. మేమే ప్రతీక్షించాలి — అన్నారు. ఇంతలో టేబిల్‌పైన ఒక సర్క్యులర్ కనిపించింది. యథాలాపంగా చూచాను. అది ఉపాధ్యాయులకు వైస్‌చాన్సలర్ పంపిన సర్క్యులర్. దాని సారాంశమిది :— ఉపాధ్యాయులు డ్యూటీలో వున్నప్పుడుకూడ ఏదో సాకుతో సరిగా తరగతులకు వెళ్లి పాఠాలు చెప్పడంలేదని నా దృష్టికి వచ్చింది. పాఠాలు చెప్పడం, విశ్వవిద్యాలయం తన ప్రయోజన దృష్టితో అప్పజెప్పిన తక్కిన పనులను నిర్వర్తించడం ఉపాధ్యాయుల విద్యుక్తధర్మమని చెప్పడం అనవసరం. ఈ సర్క్యులర్ తాత్పర్యాన్ని ప్రిన్సిపాలులు, ఆయా శాఖల అధిపతులు ఉపాధ్యాయులు గ్రహించేట్టు చేయాలి; ఉపాధ్యాయులు తమ విధులను, పరీక్షలు మొదలయిన ఇతర కార్యాలను శాయశక్తులా, చిత్తశుద్ధితో నిర్వహించేట్టు చేయాలి. తరగతులలో కచ్చితంగా విద్యార్థుల హాజరీ తీసుకోడంతో పాటు ఉపాధ్యాయులు తాముకూడ డ్యూటీలో వున్నప్పుడు తరగతులకు కచ్చితంగా వెళ్లాలి — ఉపాధ్యాయులను ఇంతగా శాసించే వైస్‌చాన్సలర్లు విద్యార్థులను శాసించవచ్చుకదా ! వారు తరగతులకు వచ్చేట్టు చర్యలు తీసుకోవచ్చుగదా ! రాజు తలచుకుంటే దెబ్బలకు కరవా ? కాని వారు అలా చేయలేరు. దీనికి కారణం విద్యావిధానంలో లోపమే. నేటి విద్యార్థులలో అధిక సంఖ్యాకులకు చదువు వ్యాపారం. వారివెంట ఏ రాజకీయ నాయకులో అధికారంలో వుంటారు. వారు వీరిపై ఈగ వాలనివ్వరు. ఇలా పరమపద సోపానం ఎక్కినవారే రేపు ఇంజనీర్లు, డాక్టర్లు. అలాటివారితో జాతి ఎంత సంపన్నమవుతుందో చెప్పవలసిన పనిలేదు ! విద్య పరమార్థం విస్మృతమయింది. లేకపోతే విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు ప్రతీక్షించవలసిన దుర్గతి ఏర్పడుతుందా ? విద్య కేవలం అర్థకం అనే అభిప్రాయం ఏర్పడింది గనుక విద్యార్థులు యేనకేనాప్యుపాయేన పట్టాలు పుచ్చుకొని, తద్వారా అదే పద్ధతిలో ఉద్యోగాలు సంపాదించే ప్రయత్నం చేస్తున్నారు. అలాటివారికే ఉద్యోగాలు. అంటే ఇదొక విషమవలయమయింది. స్వాతంత్ర్యాత్ పూర్వం గుమస్తాలను, బానిసలను తయారుచేసే చదువు వద్దని ఎన్ని జాతీయ విద్యాలయాలు నెలకొనలేదు. అలాటి విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలు కూడ నేడు తమ ఆదర్శాలు మాని సాధారణ విశ్వవిద్యాలయాయి. కనుక, ప్రభుత్వ విధానం మారినప్పుడే విద్యారంగంలో పాతకాలపు గురు శిష్య సంబంధాలు నెలకొంటాయి.

## బాలల దినోత్సవం :

నెహ్రూ జన్మదినోత్సవం బాలల దినోత్సవంగా జంట నగరాలలో జరిగింది. మునిసిపల్ శాఖామంత్రి శ్రీ వై. రామకృష్ణుడు ఆబిడ్ సర్కిల్‌లోని నెహ్రూ విగ్రహాన్ని 14వ తేదీ ఉదయం పూలమాలలతో అలంకరించారు. లాల్‌బహదూర్ స్టేడియంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉత్సవంలో జంటనగరాలలోని పెక్కు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని బృందగానం చేశారు. దీనిలో దాదాపు ఐదువేలమంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామంతపురంలోని భారతీయ విద్యా వికాస సమితి శ్రీకృష్ణాచార్య స్మారక సంస్కృత మహావిద్యాలయంలో నవంబర్ 13న వివిధ భాషాకవి సమ్మేళనం 14న బాలల దినోత్సవం జరిపింది. కవి సమ్మేళనానికి డాక్టర్ దివాకర్ల వేంకటావధాని అధ్యక్షత వహించారు; సంస్కృత కవిత పఠించారు. ధరల పెరుగుదల, వరదక్షిణ కవితా విషయాలూ, శ్రీయుతులు డాక్టర్ కె. రాజన్నశాస్త్రి, వి. సుందరశర్మ, ఏ రాములు, రామాచార్య ఘనపాటీ సంస్కృత కవిత, డాక్టర్ సి. హెచ్. రామారావు తెలుగు కవిత, శ్రీయుతులు ఇందు వసిష్ఠ, గిరిజాశంకర శర్మ, ఓంప్రకాశ్ నిర్మల్, మెహరాజ్‌శర్మ, బాలకృష్ణ శర్మ, వేణుగోపాల్ అగ్రవాల్, మాయా శ్రీవాస్తవ, కె.కె. వురే, శ్రీమతీవీరా, సావన్ హిందీ కవిత పఠించారు. డాక్టర్ రాజన్న శాస్త్రి జామాతా దశమగ్రహః — అనే దానిని వ్యంగ్యరీతిలో చెబుతూ, నవగ్రహగుణాలూ అతనికి వుందని వర్ణించారు. అతడు తపనుడు (తాపం కలిగించేవాడు), దోషాకరుడు (దోషాల పుట్ట), కుజనుడు (చెడ్డ పుట్టుకగలవాడు), ఆత్మ స్తుతిలో గీష్పతి, అసత్య కథనంలో కవి (శుక్రుడు), స్వార్థరహితంగా పనిచేయడంలో పంగువు (కుంటివాడు — శని), ఇతరులను దూషించడంలో బుధుడు — ఈ విధంగా సప్త గ్రహాల గుణాలున్నాయన్నాడు రాజన్నశాస్త్రి.

## ఉపశ్రుతి :

“ఏమి సార్, అంబర్‌పేట రస్తా ముఫ్ఫై ఏళ్లుగా గతుకులు, గుంతలతో ఉంది గదా, అప్పుడు లేంది ఇప్పుడు రాస్తారోకో ఉద్యమం తలపెట్టారేమిటి ?” అనడిగాను ఉద్యమ నాయకులను. “భలే ప్రశ్నండీ. అప్పుడు మా పార్టీ అధికారంలో వుంది. ఉద్యమాలకు మాకు తీరికేదీ ? ఇప్పుడు తీరిక దొరికింది ప్రజాసేవకు” అన్నారు వారు.

— తిరుమల రామచంద్ర ★

---

“ఈ యంత్ర పరికరాన్ని అర్థం చేసుకుని పని చేయించే సామర్థ్యం నాకు లేదు — ప్రయత్నిద్దాము కాని, కొన్ని సంవత్సరాలకి గాని ఏదీ తెలియదేమో ...” హామా అన్నాడు కొంచెం నిస్పృహతో.

“తప్పకుండా ప్రయత్నిద్దాము ! పరిధి పెడ్తే ఎలా ? రోజూ కావలసినంత ఆహారం ఎలా దొరుకుతుందో కనిపెట్ట గలిగాము. ఇక్కడి రేడియో ప్రసార యంత్రంతో వీలయినన్ని పరిశోధనలని జరుపుదాము ...” లోపల సందేహంగానే ఉన్నా బయటికి ధైర్యంగా మాట్లాడాడు సూరి.

* * *

ఐక్యరాజ్యసమితి, సెప్టెంబర్ 21 :— అధ్యక్షుడు శ్రీ — ఈ రోజు ఐ.రా.స. సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ పైవారం చంద్ర మండలంలో దిగిపోయే తమ అంతరిక్ష నావికులు తప్పకుండా అక్కడ ఉంటున్న శ్రీయుతులు హామా, సూరిలని కలుసుకోగలరని ఆశిస్తున్నామన్నారు. భూమి చంద్రమండలాల మధ్య రేడియో ప్రసార సౌకర్యం ఏర్పడింది కాబట్టి అంతరిక్ష నావికులకి ఇది చాలా సౌకర్యంగా ఉండగలదన్నారు. ఇంకా శ్రీ —... వార్త. ●

**ఆంధ్రసచిత్రవారపత్రిక**
**1967 ఆగష్టు 18,**
**సంచిక నుంచి**